ఆకస్మిక తనిఖీ

తిరుపతినుంచి సికింద్రాబాద్ వెళ్ళే వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ ఉదయం 9.55 కు కాచిగూడ స్టేషన్లో ఆగింది. కుడిచేత చిన్న సూట్‌కేసు, ఎడమచేత పెద్ద కాన్వాసు సంచీ పట్టుకుని, ఒక సెకండ్ క్లాస్ రిజర్వుడు కంపార్టుమెంటు నుంచీ ప్లాట్‌ఫారం పైకి దిగాడు గోకవరం నాగిరెడ్డి.

అప్పటికే పెట్టె పెట్టె గాలిస్తూ ఆ కొసనుంచి ఈ కొసకు పరుగుతీస్తున్న క్రిక్కిరిసిన జనంలో తండ్రి జాడ గుర్తించలేక అలాగే ముందుకు సాగిపోతున్నాడు.

"ఒరేయ్ సుందరమూర్తీ! ఇక్కడా నాయనా, ఇక్కడ!" అంటూ కేక పెట్టాడు నాగిరెడ్డి.

సుందరమూర్తి కాళ్లకు సడన్ బ్రేకు పడింది. అతడు గిరుక్కున వెను దిరిగి పెద్ద పెద్ద అంగల్లో దగ్గరికి వచ్చి" కనిపించకపోతే – నువ్వింకా రాలేదేమోననుకుని..." అంటూ గస పోసుకోసాగాడు.

"గుడ్డెద్దు చేలో పడ్డట్టు నీ ముక్కుకు నేరుగా నువ్వెళ్లిపోతే ఎట్లారా నాయనా! కొంచెం పక్క చూపులు కూడా వుండాలి గదా!"

తానెంత జాగ్రత్తగా వుండాలనుకున్నా ప్లాట్‌ఫారంపైనే క్లాసు ప్రారంభమై పోయినందుకు కించపడిపోతూ "ఆ సామాన్లిలా ఇవ్వు నాన్నా!" అంటూ చేతులు సాచాడు సుందరమూర్తి.

"సంచీ మోయడం ఇక్కడ ఫేషన్ కాదేమోలే! నువ్వీ పెట్టె పట్టుకో..." అన్నాడు నాగిరెడ్డి.

టి.సి.కి టిక్కెట్లప్పగించి గేటుదాటుకోగానే ముందుకువెళ్తున్న సుందరమూర్తి గబుక్కున ఆగిపోయి "మరి... ఇక్కడేమిటంటే నాన్నా..." అంటూ నీళ్లు నమలసాగాడు.

"చెప్పరా నాయనా! పల్లెటూరోణ్ణి గదా! అన్నీ నువ్వు చెప్పాల, నేను తెలుసుకోవాల చెప్పు..."

నాగిరెడ్డి మామూలుగా మాట్లాడే పద్ధతి అంతే! కానీ తనకేర్పడి వున్న పరిస్థితుల్లో తాను తన గుట్టు రట్టుగాకుండా ఆయన దగ్గర ఎలా మసులుకోవాలో, ఎలా వచ్చిన వాడిని అలాగే హైదరాబాద్‌నుంచి సాగనంపాలో తోచక తనలో తాను కొట్టుమిట్టాడి పోతున్నాడు సుందరమూర్తి. ప్రస్తుత ప్రతిపాదన ఆయనక్కొంచెం కోపం కలిగించేదే అయినప్పటికీ, గత్యంతరం లేక కొనసాగించాడు.

"ఇక్కడెట్లాగంటే నాన్నా! మనం వెళ్లాలనుకున్నప్పుడు రైల్లో చోటుంటుందన్న నమ్మకం లేదు. అందుకని కొద్ది రోజులు ముందుగానే బెర్తు రిజర్వు చేయించుకుంటారు..."

"ఎట్టెట్టా? వచ్చీ రాకముందే ఇక్కడినుంచి వెళ్లిపోయే సంగతి ఆలోచించుకోవాలని చెప్పు. మంచిదిరా అబ్బోడా! వరిపైరు కలుపుకొచ్చింది. పగుల్లో కరెంటుండదు. ఒక దినం ఆదమరిస్తే, మళ్ళీ నాలుగు దినాలు పారగట్టినా నీళ్లు నిలవ్వు. నేనిక్కడుండబోయేది

రేపొక్క దినమే! మొన్నాటికిదే రైల్లోనే తిరుగుప్రయాణం. నువ్వా టిక్కెట్టు సంగతేందో చూడు..."

'హమ్మయ్య! గండం గడిచేటట్టే వుంది' అనుకున్నాడు సుందరమూర్తి. గబగబా బుకింగు కౌంటరువైపు వెళ్ళి, టిక్కెట్టుకొని జేబులో వేసుకొని పావుగంటలో తిరిగొచ్చేశాడు.

మళ్ళీ పదినిమిషాలకల్లా ఆటోరిక్షా హిమాయత్‌నగర్లో పాత ఎం.ఎల్.ఏ క్వార్టర్స్ ప్రక్కగా దూసుకుపోతోంది.

అప్పుడొక పొరబాటు పని చేశాడు సుందరమూర్తి. మరేంలేదు, "నాన్నా అమ్మ బాగుందా?" అనడమే ఆ పొరబాటు.

బ్యాగువైపు చూపిస్తూ అన్నాడు నాగిరెడ్డి – "ఈ సంచీ యింత బరువుగా ఎందుకుందో తెలుసునట్రా సుందరమూర్తీ! అడుగున ఉప్పూ, కారం వేసిన శనగ్గింజలు రెండు శేర్లో, మూడు శేర్లో వుండాయి. ఆపైన మురుకులు, పప్పు బిళ్లలు, ఓంపొడి. మీ అమ్మ ఒక పగులూ, ఒక రాత్రీ ఈ పనిపైనే వుండిపోయింది. అంటే, ఆరోగ్యం బాగున్నట్టే లెక్కగదూ! 'నేనిక్కడ క్షేమం. మీరక్కడ క్షేమమని తలుస్తాను' అని నువ్వు రెండునెల్లకైనా ఒక కార్డు ముక్క రాయకపోతివి. నే రాబట్టి సరిపోయిందిగానీ, లేకుంటే మీ అమ్మ నేలపైన నిలబడేదేనా?"

"హతోస్మి, హతోస్మి" అనుకున్నాడు సుందరమూర్తి.

ఖైరతాబాదులో ఓ సన్నటి వీధిగుండా పరుగెత్తి, ఆటో ఓ యింటిముందు నిలబడింది. ప్రహరీ గుమ్మం దాటి మెట్లెక్కితే డాబాపైన వరుసగా మూడు గదులున్నాయి. ఓ గదిముందు నిల్చుని సుందరమూర్తి చేయి వేశాడో లేదో "లోరోమోటోగే' అన్నట్టుగా రెక్క తలుపులు విచ్చుకున్నాయి. గదిలో ముప్పాతిక భాగం ఆక్రమిస్తున్న రెండింటిలోనూ, ఒక మంచంపైన చదువుతూ చదువుతూ బోర్లించిపెట్టిన పుస్తకాలముందు పద్మాసనస్థుడై కూర్చుని బుద్ధిగా ఏదో రాసుకుంటున్న ఓ యువకుడు తటాలున మంచం దిగి రెండు మంచాల నడుమ జానెడు మాత్రంగా వున్న సందులోనుంచీ తొందరగా ముందుకు రాలేక "రండి, రండి" అంటూ తబ్బిబ్బు పడిపోయాడు.

"నా రూంమేటు నాన్నా! లక్ష్మీపతి. ఈవెనింగ్ కాలేజిలో లెక్చరరుగా పనిచేస్తున్నాడు" అంటూ పరిచయం చేసి పెట్టాడు సుందరమూర్తి.

"ఉండండుండండి! కుర్చీ వేస్తాను" అంటూ గోడ కానించిన మడత కుర్చీ అందుకోబోయాడు లక్ష్మీపతి.

"ఎందుకూ! అసలే ఇరకాటం, చాలన్దానికి కుర్చీ ఒకటి వేసుకుంటే ఇక బయటుండేవాళ్లు బయట, లోపలుండేవాళ్లు లోపల వుండిపోవాల్సిందే! వద్దులే నాయనా! నేనిట్లా మంచంపైన్నే కూచుంటాను..."

"మంచిది. మంచిది. అట్లాగే కూచోండి" అన్నాడు లక్ష్మీపతి. మరిచిపోయిన డైలాగు ఒకటి తటాలున గుర్తుకొచ్చినట్టుగా వెనువెంటనే అందుకున్నాడు – "మీరొస్తున్నట్టు టెలిగ్రాం వచ్చినప్పట్నుంచీ సుందరమూర్తి ఒకటే తహతహపడిపోవడం! దిగాల్సిన చోటగాకుండా ముందుగా మరేదైనా స్టేషన్లో దిగేస్తారేమో – కాచిగూడాలో దిగకుండా

సికింద్రాబాదు వెళ్ళిపోతారేమో – కొంపదీసి ఏ కారణం వల్లనైనా ట్రెయిను మార్గమధ్యంలో నిలిచిపోతే తిండీ తిప్పలూ లేకుండా అవస్థపడిపోతారేమో – ఇలా ఎన్నో సందేహాలు..."

"ఇంతకూ నేను వచ్చి తీరతాననిగూడా అనుకోలేదేమో! నువ్వా సందేహం సంగతి చెప్పలేదే!" ముంగాళ్లకు బంధం తగిలించాడు నాగిరెడ్డి.

లక్ష్మీపతి తెల్లబోయినట్టుగా సుందరమూర్తివైపు చూశాడు. సుందరమూర్తి 'నీ పాత్రను నువ్వు బాగానే పోషిస్తున్నావులే!' అన్నట్టు మిత్రుడివైపు సాభిప్రాయంగా చూచాడు. ఆ హెచ్చరికను మనసులో గట్టిగా నిలుపుకుని లక్ష్మీపతి మళ్లీ తన పాత్రను తాను పోషించడంలో నిమగ్నుడైపోయాడు.

"అయ్యయ్యో, మీరింకా నుంచుంటే ఎలాగండీ! టిఫినుకెట్లాగూ వేళదాటిపోయింది. ఏకంగా భోంచేద్దురుగానీ, లేచివెళ్లి స్నానం చేయండి. అదే బాత్‌రూం. చూడవోయ్ సుందరమూర్తి, అక్కడ సోపూ, టవలు ఉన్నాయో లేదో చూడు. అన్నట్టీరోజు బ్యాంకుకు సెలవు పెట్టావు కదూ?"

పెట్టానన్నట్టుగా సుందరమూర్తి తలపంకించాడు.

"ఎందుకనో?" ప్రశ్నించాడు నాగిరెడ్డి.

"భలేవారే! మీరు హైదరాబాద్ రావడం యిదే మొదటిసారి కదటండీ! ఇక్కడెన్నెన్ని విశేషాలు! అవన్నీ మీకు చూపించొద్దూ?"

మొత్తంపైన ఇదంతా ఇద్దరు వేటగాళ్లు ఒక అడవి మేకని ఉచ్చులవైపు పరవ దోలినంత పనైపోయింది. పబ్లిక్ గార్డెన్స్ దగ్గరినుంచీ మొదలెట్టి, టాంక్‌బండ్, నక్షత్రశాల, బిర్లామందిరం మొదలైనవి చూపెట్టి, దారిలోనే రాత్రి భోజనంగూడా ముగించి, తండ్రీ కొడుకులు గదిలోకి చేరుకునేటప్పటికి పథకంలో మొదటిభాగం విజయవంతంగా నెరవేరినట్టయింది. ఆపాటికి లక్ష్మీపతిగూడా ఈవెనింగ్ కాలేజీనుంచి తిరిగివచ్చి, గదిలో హాజరైపోయి వున్నాడు.

"ఇక్కడున్న రెండు మంచాల్లో ఇద్దరు మాత్రమే పడుకోవచ్చునాన్నా! నువ్వు పడుకో, దగ్గర్లోనే నాకొక స్నేహితుడున్నాడు. నేను వెళ్ళి వాడి రూములో పడుకుంటాను" అన్నాడు సుందరమూర్తి. అన్నాడేగాని, ఆ ప్రతిపాదనపైన తండ్రి అభిప్రాయమేమిటో తెలుసుకునే ఆసక్తి మాత్రం అతడికి లేకపోయింది. చివరి మాటతోబాటు మెట్లు దిగేస్తూ "తెల్లవారే సరికి వచ్చేస్తాలే!" అని అక్కడినుంచే అరచి చెప్పాడు.

మిత్రుడి ప్రవర్తనలోని తొట్రుబాటును లక్ష్మీపతి యిట్టే గ్రహించేశాడు. పరిస్థితిని కాస్తా సర్దుబాటు చేయడం బాగుంటుందనిపించి" ఆ మాట కాస్తా నింపాదిగా చెప్పి వుండొచ్చు గదా!" అన్నాడు.

"మా వాడంతేలే నాయనా!" అందుకున్నాడు నాగిరెడ్డి. "ఎక్కడో చదువుకుంటానని చెప్పి, నేరుగా సినిమాలకు వుడాయించేసే వాడు. ఇది మొదట్నించీ వాడి కలవాటే!"

లక్ష్మీపతి నిర్ఘాంతపడిపోయాడు. తాను వ్యవహరిస్తున్నది ఒక పల్లెటూరి ముసలాయనతోనంటే అతడికిప్పుడు నమ్మకం కలగడంలేదు. ఈయనెక్కడి పల్లెటూరి వాడురా బాబూ, ఆవులించకముందే ప్రేవులు లెక్కపెట్టేస్తున్నాడు!

మరునాటి ఉదయం ఎనిమిదిన్నరకల్లా టిఫిన్ ప్యాకెట్లతోను, ఫ్లాస్కులో పోయించుకున్న కాఫీతోనూ పితృసేవా పరతంత్రుడిలా పరతెంచి వచ్చేశాడు సుందరమూర్తి. "బ్యాంకులో ఆడిట్ జరుగుతోందినాన్నా! లేకపోతే సెలవుపెట్టేవాణ్ణే! సాలార్‌జంగ్ మ్యూజియం, చార్‌మినార్, గోలకొండ కోట - అవన్నీ నీకు లక్ష్మీపతి చూపిస్తాడు" అంటూ ఎలా వచ్చినవాడు అలాగే మాయమైపోయాడు.

గంట పది దాటింది. పదకొండు కావస్తోంది. కానీ నాగిరెడ్డి మాత్రం ఎంతకూ బయటకు కదిలే సూచనలు కనిపించడం లేదు. "ఏమండీ, వెళ్దొద్దామా!" అంటూ కొంచెం భయం భయంగానే ముగ్గులోకి దిగాడు లక్ష్మీపతి.

"ఎక్కడికి నాయనా! గోలకొండ కోటకా!" సాగదీశాడు నాగిరెడ్డి.

"కాదటండీ మరి! హైదరాబాద్ వచ్చిన వాళ్లు ఎట్టి పరిస్థితుల్లోనూ దాన్ని చూడకుండా వెళ్లరు..."

నాగిరెడ్డి పకాలున నవ్వేశాడు- "నాయనా లక్ష్మీపతి! పరీక్షల తర్వాత మార్కుల కాయితం చేతికిస్తే' మార్కులు తక్కువగా వొచ్చినాయని, నా చేవ్రాలు తనే పెట్టేసి, మావాడు దాన్ని తిరిగిచ్చేసే వాడు. వాటి మాటకేంగానీ, నువ్వయినా బుద్ధిమంతుడివై వుంటావని అనుకున్నాను..."

"అరరే, అదేమిటండీ, అలా అంటున్నారు?"

"లేకపోతే కొడుకు కాపురానికి బదులు గోలకొండ కోటను చూపిస్తానంటావా నువ్వు! ఎప్పుడైతే మూడు నెలలుగా వాడి అతీగతీ తెలియకపోయేనో, అప్పుడే అనుకుంటి! నిన్న స్టేషన్లో వాడి ముఖం జూడగానే నా సందేహం బలపడిపోయే! రెండు మంచాలుంటే సరిపోయేనా? ఉండేది ఒక్కరేనని, రూములో అడుగుపెట్టగానే గ్రహిస్తి. ఏదీ, మావాడి పెట్టేదీ? పుస్తకాలేవీ? రెండద్దాలు, రెండు దువ్వెన్లు, రెండు ముఖం కడుక్కునే పనిముట్లు వుండాల్నా? అవిలేవా? ఎందుకులే నాయనా! అయిందయింది. పోయింది పోయింది. ఇంక వాడి కాపురం ముచ్చటగూడా చూసేస్తేచాలు, నా పాటుకు నేనువెళ్ళి పోతాను..."

లక్ష్మీపతి ముఖాన నెత్తురు చుక్కలేకుండాపోయింది. అతడు చేతివేళ్లు నులుముకుంటూ "మంచో చెడో జరిగిపోయింది. కానీ మీరు కోప్పడతారని పాపం, సుందరమూర్తి లోలోపల చాలా భయపడిపోతున్నాడు. మీరు కాస్త పెద్ద మనసుచేసి..." అంటూ గింజుకోసాగాడు.

"నాయనా, మా పెద్ద మనసు సంగతి నువు చెప్పొద్దు. మేము చిన్న వూళ్లో వుండే వాళ్లం. చిన్న చదువు చదువుకున్న వాళ్లం. చిన్న బతుకు బతికేవాళ్ళం. మనసు మాత్రం మాకు పెద్దదిగా ఎట్లా వుంటుంది? ఉండదు. సర్లే, అయిపోయిన పెండ్లికి మేళాలెందుకు? నువ్వు మా వాడుండే చోటికి నన్ను తీసుకెళ్ళేదుందా, లేదా? ఆ మాట చెప్పు..."

"అలాగలాగే! తప్పక వెళ్దామండీ! కానీ ఇప్పుడుకాదు. ఆ అమ్మాయిగూడా సుందరమూర్తితోబాటు బ్యాంకులో పనిచేస్తోంది. ఇద్దరూ అయిదుగంటల తర్వాత ఇల్లు చేరుకుంటారు. అందాకా మనమెక్కడికైనా తిరిగి, సాయంకాలం అక్కడికి వెళ్ళొచ్చు..."

ఆరింటికి సరిగ్గా చింతలబస్తీలోని ఓ యింటి కాంపౌండులో ప్రవేశించి, అవుట్ హౌసులావున్న ఓ వాటా ముందు నిలబడి కాలింగ్ బెల్ నొక్కాడు లక్ష్మీపతి. రెక్క తలుపుల్లో

ఒక్కటి మాత్రం తెరచుకుంది. పంజాబీ దుస్తుల్లో వున్న ఒక యువతి చేతులు జోడించి "నమస్తే భాయిజీ, ప్లీస్ కమిన్" అంటూ లక్ష్మీపతిని ఆహ్వానించింది.

"నమస్తే సిస్టర్! ఐ థింక్ దట్ సుందర్ ఈజ్ నాట్..." అంటూ అర్థోక్తిలో ఆగిపోయాడు లక్ష్మీపతి.

"యస్, యస్! హి వెంట్ టు యువర్ రెసిడెన్స్ టు మీట్ హిజ్ ఫాదర్" అంది ఆ అమ్మాయి.

"ఎక్స్‌క్యూజ్‌మి సిస్టర్! ప్లీజ్ మీట్ యువర్ ఫాదర్-ఇన్-లా మిస్టర్ నాగిరెడ్డి!" అవుటు పేల్చినట్టుగా అన్నాడు లక్ష్మీపతి.

ద్వారంనుంచి తల ఈవలికి సాచి, నాగిరెడ్డి కనిపించగానే ఆ పడుచు గృహిణి గాలివానలో పూలతీగలా కంపించిపోయింది. చెంపలపైన, ముక్కుపుటాలపైన గుప్పుగుప్పున చెమట బిందువులు పొటమరించాయి. అయినా ఆంతరంగిక చైతన్యం ఒకటి స్తబ్ధమై పోలేదేమో, ఆమె తటాలున మెట్లు దిగివచ్చి "నమస్తే బాబూజీ!" అని పాదాభివందనం చేస్తూ 'ఆయియే, ఆయీయే' అంటూ లోపలికి తీసుకెళ్ళి, 'బైటీయే బైటీయే' అంటూ సోఫాలో కూచోబెట్టింది.

"ఏమమ్మా, తెలుగు రాదా?" అన్నాడు నాగిరెడ్డి.

"కుంచం... కుంచం... వచ్చు"

గదిలోనుంచి మెరుపు జారినట్టుగా లోపలికి వెళ్ళిపోయిన అమ్మాయి అయిదు నిమిషాల్లో తిరిగొచ్చింది. ఇప్పుడామె నిండైన చీర ముస్తాబుతో, పొందికైన జాకెట్టుతో అచ్చమైన తెలుగమ్మాయిలాగే వుంది. రెండు ప్లేట్లనిండా స్వీట్స్, మిక్చర్, యాపిల్ పళ్ళ ముక్కలూ తెచ్చి పెట్టి "మైనే జోర్ దేకర్ చతాయాథా ఆప్‌కో సీధే ఘర్‌లామే. ఉన్‌హోనే మేరే బాత్ నా మానీ. మేరాయకీన్ థాకోయీ అదృశ్యశక్తి ఆప్‌కో యిధర్ ఖీంచ్ లాయేగా. మే సారేయింత జామ్ యిసీలియే మైనే కర్‌లియా" అంది.

నాగిరెడ్డి లక్ష్మీపతివైపు చూశాడు. లక్ష్మీపతి దుబాసీ పనికి పూనుకుంటూ "మిమ్మల్ని నేరుగా యిక్కడికే తీసుకురమ్మని చెప్పిందట! సుందరమూర్తి వొప్పుకోలేదట! అయినా ఏ అదృశ్యశక్తి అయినా మిమ్మల్ని యిక్కడికి తీసుకొస్తుందని ఈమె అనుకుంటూ వుందట! అందుకోసమే ఇవన్నీ తెచ్చి పెట్టానని అంటూ వుంది" అన్నాడు.

ఉపాహారం ముగించిన తర్వాత "సెలవిప్పిస్తే యిక నేను వెళ్లొస్తాను" అన్నాడు లక్ష్మీపతి.

"మంచిది. వెళ్ళిరా నాయనా! మావాడు నీ రూము దగ్గరుంటాడులే! వాడితో చెప్పు. పులి కడుపున పుట్టి వాడు మేకరుపు అరుస్తున్నందుకు నాకు బాధగా వుంది. మేము పడమటి గడ్డవాళ్ళం. మోటుముండా వాళ్ళమని లెక్క. తప్పో, ఒప్పో మాకు రైటనిపించింది చేస్తాం. ఈపని చేసినా, నీకిష్టమైతే ఒప్పుకో. లేకపోతే తప్పుకో- అనేస్తాం. వాడబ్బ ఫాలాక్షుడితో ఎవ్వారమైనా ఇంతే మా కత! పెండ్లి అనేది నీ యిష్ట ప్రకారం నువ్వు చేసుకోవలసింది చేసుకున్నావు. ఇంక దాన్ని బయటపెట్టడానికి భయపడి చస్తావెందుకు? ఛా ఛా, మగపుట్టక పుట్టి ఈ పిరికితనం పనికిరాదని చెప్పు, వాడి కంటే ఈ ఆడబిడ్డ మేలు..."

లక్ష్మీపతి వెళ్ళిపోయాక అలమారాలో ఏవో పాత తెలుగు పత్రికలుంటే పైకి తీసి, దుమ్ము దులిపి, వాటిని చూస్తూ కూర్చున్నాడు నాగిరెడ్డి. వంట గదిలోనుంచీ మసాలా పోపు వాసనలు జమాయిస్తూ గాలిలో కలిసి వస్తున్నాయి. గంట ఎనిమిది కాగానే గృహిణి డైనింగు టేబులుపైన విస్తరి వేసేసింది. "జరా జార్... తోడాజార్ ఖాయీయే" అంటూ కొసరి కొసరి వడ్డించింది. మొదటిది వినయం. రెండోది సర్దుబాటు మనస్తత్వం. మూడోది, చూడ ముచ్చటగా ఇంటిని సర్దిపెట్టుకున్న తీరు. నాలుగోది శాకపాకాల రుచి. అయిదు వడ్డించడంలో ఆప్యాయత. అన్నింటిలోను ఈ పిల్ల పాసుమార్కులు కొట్టేసింది. ఫరవాలేదు, పెళ్ళి అనేది లాటరీయే అయినప్పటికీ ఈ పనికిమాలిన వెధవకు మంచి విలువైన వస్తువే దొరికింది!

భోజనం చేసిన తర్వాత కోడలు తెప్పించిన మిఠాయికిళ్లీ నములుతూ హాల్లో తనకోసం వేసిన మంచంపైన దిండుకానుకుని కూర్చున్నారు నాగిరెడ్డి. ఎదురుగా గదిలో టేబులు దగ్గర కూర్చుని ఇంటి ఇల్లాలు ఓ పుస్తకంలో పుటలు అటు ఇటు త్రిప్పుతూ, చిన్న కాగితంలో ఏదో రాసుకుంటూ ఉంది. అలా పదిహేను నిమిషాలు గడిచిన తర్వాత ఆమె హాల్లోకి వచ్చి, మామగారి చూపునానేటట్టుగా నిలబడి "ఇంకొకసారి... మీరు అత్తగారిని... తెండి. ఆ లోపల... నేను... టెలుగూ... నేర్చుకుంటాను" అంది.

"ఇన్ని మాటలెట్లా వొచ్చినాయమ్మా నీకు?" అన్నాడు నాగిరెడ్డి ఆశ్చర్యపడిపోతూ.

కోడలు తన చేతిలోని పుస్తకాన్ని మామగారి చేతిలోపెట్టింది. దానిపేరు 'ముప్ఫై రోజుల్లో తెలుగు' అనే ఇంగ్లీషు మీడియంద్వారా.

"అట్లనే, అట్లనే! తప్పకుండా పట్టుకొస్తాను. దానికే గాని తలుపు దగ్గర ఏదో చప్పుడవుతూ వున్నట్టుంది. బహుశా వాడే అయివుంటాడు. వెళ్లి చూడు" అన్నాడు నాగిరెడ్డి.

❖ ఆంధ్రజ్యోతి దినపత్రిక - ఆదివారం అనుబంధం, 1989. ❖